క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

చౌడేపల్లి: పచ్చిరొట్ట (జనుము, జీలుగ) విత్తనాలు రాయితీ ధరలతో రైతు భరోసా కేంద్రంలో అందుబాటులో ఉన్నాయని, రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ జ్యోతమ్మ తెలిపారు. శనివారం కొండామర్రి ఆర్బీకేను తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ జనుము, జీలుగ విత్తనాలు 10కేజీల బస్తా రూ.450 చొప్పున విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్‌కార్డుతో ఆర్బీకేలో అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్‌ను సంప్రదించాలని కోరారు.

చురుగ్గా టవర్ పనులు



టవర్ పనులను పరిశీలిస్తున్న మోహన్

చౌడేపల్లి: భక్తుల సౌకర్యార్థం బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. పనులను ఈఓ చంద్రమౌళి, బీఎస్ఎన్ఎల్ సీజీఎం కార్యాలయ ఎస్‌డీఈ మోహన్ తనిఖీ చేశారు. త్వరగా పనులు పూర్తిచేసి ప్రజలకు బీఎస్ఎన్ఎల్ సేవలు అందేలా కృషిచేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీసులకు సహకరించాలి



మైక్ ప్రచారంలో పోలీసులు

వి.కోట: ఈనెల 4వ తేదీ ఓట్ల లెక్కింపు కారణంగా మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని దీన్ని గుర్తించి ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ లింగప్ప సూచించారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో పోలీసులు ఆటోల్లో మైకులు పెట్టుకుని అవగాహన కల్పించారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

సదుం: మండలంలోని తాటిగుంటపాలెంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ మాట్లాడుతూ జూన్ 1 నుంచి 30 వరకు నిర్వహించే మాసోత్సవాల్లో భాగంగా చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీహెచ్‌ఓ రషీద్, జానకి, సత్తాజ్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

6న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు

పుంగనూరు: మండలంలోని ఆడవినాథునికుంట ఏపీ మోడల్ స్కూల్‌లో ఈనెల 6న 7, 8, 9 తరగతులకు ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ రమా తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ఈ ప్రవేశ పరీక్షల కోసం పాఠశాలలో జూన్ 5వ తేదీలోపు నమోదు చేసుకోవాలన్నారు. 6న ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు కామన్ పరీక్ష పేపర్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. జూన్ 8 నుంచి పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు కల్పిస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం మోడల్ పాఠశాలలో సంప్రదించాలని ఆమె కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న సీఐ

వి.కోట: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ లింగప్ప హెచ్చరించారు. శనివారం ఆయన పట్టణంలోని పలు ప్రాంతాల్లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు భారీగా వేయడంతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

గురుకులలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్లలోని మహాత్మా జ్యోతీరావు పూలే సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 2024–25 సంవత్సరానికి 6,7,8 తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ బి.సునీత తెలిపారు. జూన్ 5 నుంచి 15 వరకు దరఖాస్తులు చేసుకోవాలని, అనంతరం 20న రాత పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందన్నారు. 6వ తరగతిలో 14, 7,8వ తరగతిలో 10 సీట్లు ఉన్నాయని తెలిపారు.

పుంగనూరు: అరవపల్లెలో ఆంజనేయస్వామి, సదుం: గార్గేయ నదీ తీరంలో ఆంజనేయస్వామి, చౌడేపల్లెలో అన్నదానం చేస్తున్న మిద్దింటి కిషోర్‌బాబు, చౌడేపల్లెలో కమలాంజనేయస్వామి, పెద్దపంజాణి: విశేష అలంకరణలో రామబంటు







జై హనుమాన్.. జైజై హనుమాన్

- ఘనంగా హనుమజ్జయంతి

పుంగనూరు: హనుమజ్జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాలలో శనివారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అలంకరణ చేశారు. అరవపల్లె వద్ద వెలసిన ఆంజనేయస్వామి ఆలయం, హనుమంతరాయుదిన్నెలోని ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం, సుబ్బమ్మ చెరువు మొరవలోని హనుమాన్ ఆలయంలోనూ పూజలు నిర్వహించారు.

సదుంలో..

సదుం: గార్గేయనది తీరంలోని ఆంజనేయస్వామి ఆలయం, కాలేజీ రోడ్డు, భట్టువారిపల్లె, బూరగమంద, సీతమ్మగుట్ట, మత్తుకువారిపల్లె సమీపంలోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. ఆలయాల్లో స్వామి వారికి అభిషేకాలు, విశేష అలంకారం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచారు.

చౌడేపల్లెలో..

చౌడేపల్లె: మండలంలోని చౌడేపల్లె, కరణంవారిపల్లె, చింతమాకులపల్లె, అమరకృష్ణాపురం, గాండ్లపల్లె, ఊటూరులో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మిద్దింటి కిషోర్‌బాబు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

పెద్దపంజాణిలో...

పెద్దపంజాణి: బాలేపల్లి సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. కమ్మపాళ్యంకు చెందిన రాము ఉభయదారులుగా వ్యవహరించి అన్నదానం చేశారు. వేంకటేశ్వర భక్త మండలి రామకోటి భజనలు నిర్వహించారు. దిన్నిపల్లి, పెద్దపంజాణిలో హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు.



పలమనేరు: పూజల్లో పాల్గొన్న భక్తులు

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): చల్లావారిపల్లె, మతుకువారిపల్లె, పులిచెర్ల, చెరువు ముందరపల్లెల్లోని హనుమ ఆలయాల్లో ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన చేశారు.

వి.కోటలో..

వి.కోట: ఎస్.బండపల్లిలోని వీరాంజనేయస్వామి ఆలయంలో హనమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు స్వామివారిని దర్శించుకున్నారు. పట్టణంలోని వీరాంజనేయ స్వామి ఆలయంలో స్వామి వారు పత్తి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల రాకతో ఆలయం కిటకిటలాడింది.

శాంతిపురంలో..

శాంతిపురం: రాళ్లబూదుగూరులోని కోదండరామస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. పూలు, తమలపాకులతో విశేష అలంకరణతో హనుమ భక్తులకు దర్శనమిచ్చారు.

కుప్పంలో..

కుప్పంరూరల్: కొత్తయిండ్లు ఆంజనేయస్వామి, చీలేపల్లి తిమ్మరాయస్వామి, బేటరాయస్వామి కొండపై ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

రామకుప్పంలో..

రామకుప్పం: మండలంలోని ఆంజనేయస్వామి, శ్రీరామ దేవాలయాల్లో హనమజ్జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి ప్రత్యేక అభిషేకాలు, విశిష్ట అలంకరణ చేశారు. జై శ్రీరామ్ నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఆంజనేయస్వామి ఆలయాలకు బారులు తీరారు.



వి.కోట: పత్తి అలంకరణలో ఆంజనేయస్వామి

పలమనేరులో..

పలమనేరు: మొరం పంచాయతీ అంజనాద్రి ఆలయంలో హనుమాన్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఇక్కడి ఏకశిలా విగ్రహానికి విశేష అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: నెల్లిపట్ల సమీపంలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవస్థానం జీర్ణోద్ధరణ అనంతరం శనివారం కుంభాభిషేకం నిర్వహించారు. అంబూరు అప్పన్నచార్యులు 1,001 లడ్డూలను స్వామి వారికి ప్రసాదం వితరణ చేశారు.








పులిచెర్ల: అలంకరణలో ఆంజనేయస్వామి, వి.కోట: బండపల్లిలో స్వామిని దర్శించుకుంటున్న జెడ్పీ చైర్మన్, శాంతిపురంలో.., బైరెడ్డిపల్లె: నెల్లిపట్లలో.., పలమనేరు: ఏకశిలా వీరాంజనేయ స్వామి, కుప్పంరూరల్: కొత్తయిండ్లులో..

ఆ రెండు మండలాలే కీలకం

- అభ్యర్థి గెలుపులో కీలకం కానున్న వి.కోట, పలమనేరు
- ముస్లిం మైనారిటీ ఓట్లు మొత్తం 28 వేలకు పైగానే
- అభ్యర్థి గెలుపులో నిర్ణయాత్మకం వీరే
- గత ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపులో తేటతెల్లం

పలమనేరు: ఈనెల 4న వెలువడనున్న పలమనేరు అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో నియోజకవర్గంలోని వీ.కోట, పలమనేరు మున్సిపాలిటీలు కీలకం కానున్నాయి. ఈ రెండు మండలాల్లో వచ్చే ఓట్ల ఆధారంగానే అభ్యర్థి గెలుపు, మెజారిటీ తేలనుంది. మొన్న జరిగిన ఎన్నికల సరళిని బట్టి చూస్తే పెద్దపంజాణి, గంగవరం, బైరెడ్డిపల్లె, పలమనేరు రూరల్ ఇరుపార్టీలకు సమాన ఓట్లను సాధించగా అభ్యర్థి గెలుపులో మాత్రం వీ.కోట, పలమనేరు మున్సిపాలిటీలు నిర్ణయాత్మకపాత్ర వహిస్తాయని స్పష్టమవుతోంది.

2019 ఎన్నికల్లో వార్ వన్ సైడే

గత ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి వెంకటేగౌడ తన సమీప తెలుగుదేశం ప్రత్యర్థి మాజీ మంత్రి అమరనాథ రెడ్డిపై 31,161 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. మొదటి రౌండ్ మినహా మిగిలిన 18 రౌండ్లలోనూ వైఎస్సార్‌సీపీ హవా కొనసాగింది. దీంతో ఈ ఎన్నిక ఏకపక్షమైంది. మూడు దశాబ్దాల సుదీర్ఘ అనుభవం కలిగిన మాజీ మంత్రి అమరనాథ రెడ్డికి భారీ పరాజయం తప్పలేదు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలో దిగిన వెంకటేగౌడ అనూహ్యరీతిలో మాజీ మంత్రిని మట్టికరిపించారు. ఆ ఎన్నికల్లో తొలిరౌండ్‌లో పెద్దపంజాణి మండలంలోని పోలింగ్ స్టేషన్ 1 నుంచి 16 వరకు నిర్వహించిన కౌంటింగ్‌లో టీడీపీకి 5080, వైఎస్సార్‌సీపీకి 5033 రావడంతో 47 ఓట్ల ఆధిక్యతను టీడీపీ సాధించింది. ఈ ఫలితంతో టీడీపీ శ్రేణులు ఆనందంలో మునిగాయి. అయితే ఆపై రెండో రౌండ్‌నుంచి ప్రారంభమైన ఫ్యాను హవా ఆఖరు దాకా ఏమాత్రం జోరు తగ్గలేదు. మాజీ మంత్రి సొంత మండలమైన పెద్దపంజాణి మండలంలో పాటు అన్ని మండలాల్లో వైఎస్ఆర్‌సీపీకి 5వేలకుపైగా ఓట్ల ఆధిక్యం దక్కింది. అయితే వీ.కోట మండలంలో టీడీపీకి సాధారణంగా వచ్చే మెజారిటీ తగ్గి వైఎస్సార్‌సీపీకి 5వేలకు పైగా మెజారిటీ దక్కడంతోనే వైఎస్ఆర్‌సీపీ భారీ మెజారిటీని దక్కించుకుంది.

ఈసారి మైనారిటీలే కీలకం

నియోజకవర్గంలో మొత్తం 2,67,896 ఓటర్లుండగా 1,93,769 ఓట్లు పోలయ్యాయి. 72.33 శాతం ఓటింగ్ నమోదైంది. ఇందులో పలమనేరులో 18 వేలు, మిగిలిన మండలాల్లో 10 వేలు మొత్తం 28 వేల ఓట్లు ముస్లిం మైనారిటీలవే ఉన్నాయి. దీంతో అభ్యర్థి గెలుపులో ఈ ఓట్లు కూడా కీలకం కానున్నాయి.

భగవద్గీత చదవడం నేర్చుకోవాలి

రొంపిచెర్ల: భగవద్గీతను చదవడం ప్రతిఒక్కరూ నేర్చుకోవాలని త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కమిటీ అధ్యక్షుడు సురమౌళి అన్నారు. శనివారం బొమ్మయ్యగారిపల్లె, పెద్దగొట్టిగల్లు, బండకిందపల్లెలో భగవద్గీతపై ప్రచారం చేశారు. సభ్యులు సుధాకర్ ఆచారి, సోమశేఖర్, రామకృష్ణ, సునీల్, పద్మజ, సుమలత, పూర్ణిమ, రమణారెడ్డి, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



భగవద్గీతపై ప్రచారం చేస్తున్న సభ్యులు

పూర్తిస్థాయిలో పుస్తకాలు సిద్ధం



బైరెడ్డిపల్లెకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

బైరెడ్డిపల్లె: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పైసా ఖర్చు లేని నాణ్యమైన విద్యకు భరోసా నిలిచిన విద్యా కానుక స్టూడెంట్ కిట్లు మండలానికి చేరుకున్నాయి. విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు ఉద్దేశించిన స్టూడెంట్ కిట్‌లో భాగంగా ప్రభుత్వం ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దిన నోట్‌బుక్స్‌లో 1 నుంచి 6 తరగతులకు పూర్తిస్థాయిలో చేరుకోగా, పాఠ్యపుస్తకాలు ముద్రణా సంస్థల నుంచి విడతల వారిగా వస్తున్నాయి. విద్యార్థులకు ఎటువంటి ఆటంకం లేకుండా పాఠశాలలు తెరచిన రోజునే విద్యార్థులకు అందనున్నాయి. మండలంలోని 7,013 మంది విద్యార్థులకు పూర్తి స్థాయిలో పుస్తకాలు అందినట్లు ఎంఈఓ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

తొలిరోజే 95శాతం పింఛన్ల పంపిణీ

పలమనేరు: మున్సిపాలిటీలో శనివారం పింఛన్ల పంపిణీ సజావుగా సాగింది. ఆమేరకు 95శాతం మందికి పింఛన్లను పంపిణీ చేసినట్టు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీలో 4,691మందికి వివిధ రకాల సామాజిక పింఛన్లుండగా ఇందులో 3,332 మందికి వారి బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేశారు. ఇక బ్యాంకు ఖాతాలు లేక, మంచానికే పరిమితమైన వారు, వికలాంగులు 1,359 మంది దాకా ఉన్నారు. వీరికి సంబంధిత సచివాలయ సిబ్బంది ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. డీబీటీ ద్వారా రూ.99.96లక్షలు, డైరెక్ట్ పంపిణీ ద్వారా రూ.40.80 లక్షలను పంపిణీ చేసినట్టు పింఛన్ల ఇన్‌చార్జ్ యోగరంజని తెలిపారు.




పలమనేరులో ఇంటి వద్ద పింఛన్లు అందజేస్తున్న సచివాలయ సిబ్బంది

కల్పవృక్ష వాహనంపై వేణుగోపాలుడు

కార్వేటినగరం: వేణుగోపాలుడు కల్పవృక్ష వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగో రోజైన శనివారం ఉదయం స్వామివారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి శుద్ధి, తోమాల, పంచాంగశ్రవణం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ, భక్తులచే కర్పూర హారతులను అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ధూప, దీప, నైవేద్యాలతో రెండవ గంట నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి



గుడుపల్లె: మహిళలకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ లక్ష్మయ్య



రామకుప్పం: వంట చేయడంపై వీడియో ప్రదర్శిస్తున్న అధికారులు

రామకుప్పం: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా రిసోర్స్ పర్సన్ శ్రీదేవి అన్నారు. ప్రధానమంత్రి పోషణ్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాలల్లో వంట నిర్వాహకులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీదేవి మాట్లాడుతూ నాణ్యమైన వంటలను విద్యార్థులకు ఏ విధంగా అందించాలనే విషయాన్ని వివరించారు. తిరుపతికి చెందిన తాజ్‌హోటల్ వారు రూపొందించిన వీడియోలను వంట నిర్వాహకులకు చూపించారు. కార్యక్రమంలో ఎంఈఓ నారాయణ, సీఆర్పీలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

గుడుపల్లె: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని మోను ప్రకారం వడ్డించాలని ఎంఈఓ లక్ష్మయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వాహకులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రారంభం నుంచి విద్యార్థులకు సకాలంలో భోజనాన్ని ప్రతిరోజూ మోను ప్రకారం ఇవ్వాలన్నారు. అక్షయ పాత్ర ద్వారా వచ్చే భోజనం విద్యార్థులకు ఏలా వడ్డించాలని ఏ విధంగా పెట్టాలనే అంశంపై శిక్షణ ఇచ్చారు. ఈఓపీఆర్డీ శంకర్, అక్షయ పాత్ర అధికారులు వంట మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా అఖండ హరినామ స్మరణం

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం భక్తులచే అఖండ భజన కార్యక్రమం నిర్వహించారు. భక్తులచే ఉదయం నుంచి భజన కార్యక్రమంతో ఆలయ ప్రాంగణం స్వామి వారి నామస్మరణతో మారుమోగింది. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య మాట్లాడుతూ 10 ఏళ్లుగా ప్రతి శనివారం భక్తులచే అఖండ హరి నామస్మరణతో భజన, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.



భజన చేస్తున్న భక్తులు

లెక్కింపు పకడ్బందీగా నిర్వహించాలి




శిక్షణలో మాట్లాడుతున్న ఆర్ఓ శ్రీనివాసులు, హాజరైన అధికారులు, సిబ్బంది

- శిక్షణలో చిత్తూరు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్: ఓట్ల లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని చిత్తూరు అసెంబ్లీ ఆర్ఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియపై అధికారులు, సిబ్బందికి ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్ఓలు, అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలోనే పోస్టల్ బ్యాలెట్ స్ట్రాంగ్ రూమ్స్ తెరవడం జరుగుతుందన్నారు. ఏజెంట్లు తప్పనిసరిగా ఈనెల 4న నిర్దేశించిన సమయానికి కౌంటింగ్ కేంద్రానికి హాజరుకావాలని తెలిపారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచేటప్పుడు తప్పనిసరిగా రిజిస్టర్‌లలో వివరాలు నమోదు చేయాలన్నారు. సంబంధిత ఏజెంట్ల నుంచి సంతకాలు తీసుకోవాలని ఆదేశించారు. పోస్టల్‌బ్యాలెట్‌ల లెక్కింపులో 13సీ, 13 బీ ని ఏఆర్ఓలు, సూపర్ వైజర్లు జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపారు. ఏవైన సమస్యలున్నట్‌లెతే వెంటనే ఆర్ఓ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌ల లెక్కింపునకు 14 టేబుల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 25 ఓట్ల చొప్పున కట్టలు కట్టి ప్రతిటేబుల్‌కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 3న ఉదయం 11 గంటలకు ఎస్వీ సెట్ కౌంటింగ్ సెంటర్‌లో విధులకు కేటాయించిన అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. జూన్ 4న కౌంటింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్‌లను అనుమతించేది లేదని తెలిపారు. అలసత్వం వహిస్తే చర్యలుంటాయని హెచ్చరించారు.